క్లుప్తంగా

అధికారుల నిర్లక్ష్యం.. విద్యా, వైద్య రంగాలు నిర్వీర్యం

తలకొండపల్లి: కొందరు ఉద్యోగులు ప్రభుత్వం నుంచి వేతనం తీసుకుంటూ.. ప్రైవేట్ రంగాల వృద్ధికి పాటుపడుతున్నారని బీఎస్పీ తాలుకా అధ్యక్షుడు దన్నారం బాలు శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. వారి నిర్లక్ష్య ధోరణితో ఈ రెండు రంగాలు నిర్వీర్యం అవుతున్నాయని పేర్కొన్నారు. తద్వారా పేదలకు సర్కారు విద్య, వైద్యం అందకుండా పోతోందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వ వైద్యులు సొంతంగా క్లినిక్‌లు, ఉపాధ్యాయులు పాఠశాలలను నడిపిస్తూ మోసం చేస్తున్నారని విమర్శించారు. ఈ రంగాలకు అనుకూలంగా ఉన్న వారినే ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. బహుజనులందరికీ న్యాయం జరగాలంటే ఈ రంగాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

హైవే పక్కనే చెత్తాచెదారం



పెద్దఅంబర్‌పేట ఔటర్ సమీపంలో సర్వీస్‌రోడ్డు పక్కన చెత్త కుప్ప

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధి ఔటర్‌రింగ్‌రోడ్డు సమీపంలో విజయవాడ జాతీయ రహదారి, ఔటర్ సర్వీస్‌రోడ్డు పక్కన చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. సమీపంలోని దుకాణదారులు, బాటసింగారం పండ్ల మార్కెట్‌కు పండ్లు తీసుకువచ్చే వాహనదారులు రోడ్డు పక్కన చెత్తాచెదారాన్ని పారబోస్తున్నట్లు సమాచారం. పురపాలక సంఘం అధికారులు స్పందించి, చెత్తను తొలగింప చేయాలని ప్రజలు కోరుతున్నారు. చెత్త వేస్తున్న వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

నీటి ఎద్దడి లేకుండా చూడండి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

యాచారం: వేసవి నేపథ్యంలో గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మూగజీవాల దాహార్తి తీర్చడం కోసం నీటి తొట్లల్లో నీరు నింపేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ శ్రేణులు కోరారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ ఆధ్వర్యంలో నాయకులు ఎంపీడీఓ నరేందర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మండల పరిధి 24 గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు సరఫరా పెంచాలని, ప్రత్యామ్నాయంగా.. ఉన్న బోరుమోటార్లకు మరమ్మతులు చేయించాలని కోరారు. నాయకులు గోగికర్ రమేష్, గొరిగె బీరప్ప, నడుకుడి కృష్ణ, పల్లపు నరేష్, రమేష్, సాటు మల్లేశ్, పత్తి రాజు, పెద్దులు, కొండాపురం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావంతో మెలగాలి



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఆమనగల్లు: రంజాన్ మాసం చివరి శుక్రవారంను పురస్కరించుకుని పట్టణంలోని వివిధ మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా జామై మసీదు, మహ్మదీయ మసీదు, హమాదే హిలాల్ మసీదుల్లో సందడి నెలకొంది. అనంతరం ప్రార్థనాలయాల్లో మత గురువులు వహీద్, లతీఫ్‌లు మహ్మద్ ప్రవక్త బోధనలతో పాటు, అల్లా సూక్తులను చదివి వినిపించారు. ప్రతి ఒక్కరూ అల్లాపై భక్తి భావంతో ఉండాలని, నిరుపేదల పట్ల ప్రేమ, కరుణను చూపాలని సూచించారు. నిత్య సంపాదనలో ఏడాదికాలంలో పదో వంతును దైవ కార్యక్రమాలతో పాటు పేదలకు ఖర్చు చేయాలని చెప్పారు.

జాతీయ స్థాయి టోర్నీలో సత్తాచాటిన విగ్నేశ్



జ్ఞాపికతో విగ్నేశ్

మంచాల: జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో మండల పరిధి చెన్నారెడ్డిగూడ గ్రామానికి చెందిన విద్యార్థి పగడాల విగ్నేశ్ యాదవ్ సత్తాచాటాడు. పగడాల పారిజాత- లక్ష్మణ్ దంపతుల కుమారుడు.. విగ్నేశ్ స్థానికంగా 9వ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 22 నుంచి 26వ వరకు మహారాష్ట్ర నాగపూర్‌లో నిర్వహించిన జాతీయ ఫుట్‌బాల్ టోర్నీలో విగ్నేష్ పాల్గొన్నారు. అండర్ 15 సబ్ జూనియర్ బాలుర విభాగంలో మధ్యప్రదేశ్ జట్టుతో తలపడి.. మూడో స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా విగ్నేష్‌ను టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు అజ్మత్ ఖాన్ అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థి మాట్లాడుతూ.. తనను జాతీయ స్థాయిలో ఆడే విధంగా ప్రోత్సహించిన కోచ్ ఎండీ రహమత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నిధులు రాక.. పనులు సాగక

భారంగా కార్యాలయాల నిర్వహణ
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు బంద్
- సొంత డబ్బులు వెచ్చిస్తున్న అధికారులు
- అధ్వానంగా మండల పరిషత్‌ల పరిస్థితి
- ట్రెజరీల్లో నిలిచిన బిల్లులు



ఇబ్రహీంపట్నం మండల ప్రజాపరిషత్ కార్యాలయం

ఇబ్రహీంపట్నం రూరల్: పంచాయతీలు, మండల ప్రజాపరిషత్ పాలకుల పదవీకాలం ముగిసింది. ఏడాది గడిచింది. ఇంతవరకు బాగానే ఉన్నా.. నిధుల లేమితో ఆయా కార్యాలయాలు కొట్టుమిట్టాడుతున్నాయి. ఫలితంగా నిర్వహణ భారంగా మారింది. రోజువారి కార్యకలాపాలకు ఆటంకం కలుగుతోంది. పేపరు, పెన్ను ఇలా ఏది అవసరమున్నా.. సిబ్బందే వాటి ఖర్చును భరిస్తున్నారు.

ఖాతా ఖాళీ..

ఇబ్రహీంపట్నం మండల ప్రజాపరిషత్తు కార్యాలయం ఖాతా ప్రస్తుతం ఖాళీ!. ప్రభుత్వం నుంచి ఏటా రావాల్సిన జనరల్ నిధులు, టీడీలు, ఎయిట్‌రూపిస్ ఫర్ క్యాప్టా నిధులు ఆరేళ్లుగా నిలిచిపోయాయి. స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ నిధులు మూడేళ్లుగా రావడం లేదు. కేంద్రం నుంచి రావాల్సిన 15వ ప్రణాళిక నిధులు.. 2024- 25 సంవత్సరానికి నయా పైసా రాలేదు. దీంతో స్టేషనరీ మొదలు తాగు నీరు, కరెంట్ బిల్లులను తామే చెల్లించాల్సి వస్తోందని అధికారులు పేర్కొంటున్నారు.

నిలిచిన 20 చెక్కులు

మండల ప్రజాపరిషత్ పరిధి గ్రామాల్లో పదహారు నెలలుగా డ్రైనేజీల మరమ్మతు, సీసీరోడ్ల నిర్మాణం, మ్యాన్‌హోల్స్‌తో పాటు కార్యాలయంలో మరమ్మతు పనులు చేయించారు. వీటికి రూ.30 లక్షల బిల్లు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సి ఉంది. ఇందుకోసం 2023 జనవరి నుంచి నేటి వరకు చేసిన పనులకు 20 చెక్కులు రాసి, కాంట్రాక్టర్లకు ఇచ్చారు. అనంతరం వారు ట్రెజరీలకు వెళ్లగా.. అధికారులు నిధులు లేవని చెప్పడంతో ఆందోళన చెందుతున్నారు. ఇదే విషయమై.. సదరు కాంట్రాక్టర్లు పరిషత్ అధికారులను వివరణ కోరగా.. 'మేమేం చేస్తాం. మీకు చెక్కులు ఇచ్చాము' అని చెబుతున్నారని వెల్లడిస్తున్నారు. ఇదిలా ఉండగా.. మార్చి దాటితే ఆ చెక్కులు వాపస్ తీసుకొని, కొత్తవి ఇవ్వాల్సి వస్తుందని, అయినా నిధులు లేవని అధికారులు పేర్కొంటున్నారు. చేసిన పనులకు ఈఎండీ, ఎఫ్ఎస్‌డీ సినరేజ్ చార్జీలు, టీపీలు, ఐటీ, జీఎస్టీ చెల్లింపులు ఇబ్బందిగా ఉందంటున్నారు.

తెల్లకాగితం కొనలేని దుస్థితి



ఏళ్లుగా మండల ప్రజాపరిషత్ కార్యాలయానికి రావాల్సిన నిధులు రావడం లేదు. ఖర్చులు చాలా ఇబ్బందిగా మారాయి. తెల్లకాగితాలు కొనలేని పరిస్థితి. ఫోన్ బిల్లులు రూ.4500లు నేనే చెల్లించాను. ఆగస్టు 2023 నుంచి నేటి వరకు వెహికల్ అలవెన్స్ ఇవ్వకున్నా సర్దుకుపోతున్నా. కార్యాలయ నిర్వహణ భారంగా మారింది.

– వెంకటమ్మ, ఎంపీడీఓ, ఇబ్రహీంపట్నం

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



కడ్తాల్: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కడ్తాల్: బంజారాల(గోర్‌బోలి) భాషను ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చేందుకు తీర్మానం చేయడంతో పాటు, అసెంబ్లీలో ప్రవేశపెట్టినందుకు గిరిజన నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రం ప్రధాన కూడలిలో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గిరిజన రాష్ట్ర నాయకుడు లక్పతినాయక్, హన్మానాయక్ మాట్లాడుతూ.. గోర్‌బోలి భాషను గుర్తిస్తూ తీర్మానం చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, గిరిజన నాయకులు హన్మానాయక్, బీక్యానాయక్, నరేశ్‌నాయక్, బీచ్యానాయక్, హీరాసింగ్, రాజునాయక్, శక్రు, రాజేందర్, రాజు, ఇమ్రాన్, అశోక్, లక్ష్మయ్య, యాదయ్య తదితరులున్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: గోర్ బోలీ(లంబాడ) భాషను భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం.. అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసింది. అనంతరం షెడ్యూల్‌లో చేర్చాలని కోరుతూ కేంద్రానికి పంపింది. ఈ సందర్భంగా శుక్రవారం గిరిజనులు సంబురాలు చేసుకున్నారు. ఆమనగల్లు పట్టణంలోని రాజీవ్ కూడలిలో ముఖ్యమంత్రి రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం కాంగ్రెస్, గిరిజన నాయకులు మాట్లాడుతూ.. లంబాడ భాష హక్కుల సాధన కోసం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రశంసనీయమని, ఇది లంబాడ భాషాభిమానులకు గర్వకారణమని పేర్కొన్నారు. గోర్ బోలీని 8వ షెడ్యూల్‌లో చేర్చడం ద్వారా.. బంజారాల భాష, వారి పండుగలు, సంస్కృతి, ఆటపాటలు, తీజ్ వేడుకలు చరిత్రలో లిఖించబడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, నాయకులు రాగ్యానాయక్, శ్రీనునాయక్, కృష్ణనాయక్, అలీం, నాజర్, మహేశ్, భాస్కర్ నాయక్, రాజేందర్ నాయక్, మల్లేశ్, గోపాల్, సురేశ్‌నాయక్, రవినాయక్, హర్యానాయక్, శంకర్‌నాయక్, బాల్యానాయక్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చలివేంద్రం ఏర్పాటు

కడ్తాల్: మండల కేంద్రంలో కొప్పు లక్ష్మమ్మ జ్ఞాపకార్థం.. ఆమె మనవడు, యువ నాయకుడు కొప్పు కృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని.. కృష్ణ తల్లిదండ్రులు లింగయ్య- వసంతలు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. సమాజ సేవకు యువత ముందుకు రావడం అభినందనీయమన్నారు. వేసవి నేపథ్యంలో దాహా తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం దాత కృష్ణను సన్మానించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్ గుప్తా, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్ నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు రాఘవేందర్, నర్సింహ, లాయక్ అలీ, లక్ష్మయ్య, కదారి రామకృష్ణ తదితరులు ఉన్నారు.



చలివేంద్రం ప్రారంభిస్తున్న దాత కుటుంబీకులు, నాయకులు

భక్తి శ్రద్ధలతో షబ్-ఎ ఖదర్



ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

కడ్తాల్: రంజాన్‌ను పురస్కరించుకుని షబ్-ఎ ఖదర్ పర్వదినాన్ని ముస్లింలు గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారు జాము వరకు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని మసీద్ ఎ ఖుబా, మసీద్ ఎ అర్షద్‌లలో వేడుకలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయా మసీద్‌ల ఈమామ్‌లు జహీరుద్దీన్, అక్రమ్, తహజీఫ్, వజీఫ్‌ల ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. అనంతరం మసీద్ కమిటీల ఆధ్వర్యంలో ఇమామ్‌లను ఘనంగా సన్మానించారు.

జుమాతుల్ విదా

రంజాన్ చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని జుమాతుల్ విదా ప్రార్థనలు మండల పరిధిలో ఘనంగా చేశారు. కార్యక్రమంలో మసీద్ కమిటీల అధ్యక్షులు అబ్దుల్ రవూఫ్, హైమాద్ జానీ, ఉపాధ్యక్షుడు జావీద్, మత పెద్దలు, నాయకులు వహాబ్, లాయక్‌అలీ, జహంగీర్‌అలీ, జహంగీర్‌బాబా, గౌస్, ఇర్షాద్, అనీస్, నదీమ్, అశ్రఫ్, మహబూబ్‌అలీ, అజ్గర్‌అలీ, షకీల్, ఇద్రీస్, లతీఫ్, యూసుఫ్, నిజాం, సాధిక్ తదితరులు ఉన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోండి

ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి

యాచారం: జాబ్ కార్డులు ఉన్న కూలీలు ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి సూచించారు. మండల పరిధి తక్కళ్లపల్లి గ్రామంలో శుక్రవారం ఆయన ఉపాధి పనులను పరిశీలించారు. కూలీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. నింబంధనల ప్రకారం పని చేస్తే కూలీ గిట్టుబాటవుతుందన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయం, సాయంత్రం వేళలో పనులు చేసుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. పనులకు వెళ్లేటప్పుడు అవసరమైన తాగునీటిని వెంట తీసుకెళ్లాలని, నీడ సౌకర్యం చూసుకోవాలని తెలిపారు. అనంతరం గ్రామంలోని నర్సరీలో మొక్కలను పరిశీలించారు. మొక్కలు ఎండిపోకుండా నీరు పారించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ లింగయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు బీసీ కమిషన్ సభ్యుల పర్యటన

ఆమనగల్లు: పట్టణంలో శనివారం బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులు పర్యటించనున్నారని ఎంపీడీఓ కుసుమమాధురి ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని శ్రీనివాస కాలనీలో వీరముష్టి కులానికి చెందిన వారి స్థితిగతులను తెలుసుకోవడానికి సభ్యులు వస్తున్నారని ఆమె వివరించారు.

'మా ప్లాట్లను కాపాడండి'

తుర్కయంజాల్: కబ్జాదారుల చెర నుంచి తమ ప్లాట్లను కాపాడాలని పురపాలక సంఘం పరిధి కమ్మగూడలోని సర్వే నంబర్ 240, 241, 242లోని ప్లాట్ల యజమానులు, రైతులు కోరారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే.. భూమిని పరిశీలించాలని అబ్దుల్లాపూర్ మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డిని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యేతో కలిసి తహసీల్దార్.. వివాదానికి కారణమైన భూమిని పరిశీలించారు. ఆ సమయంలో అక్కడ గుంపులుగా గుర్తు తెలియని వ్యక్తులు ఉండటాన్ని గమనించి, వారిని అక్కడి నుంచి పంపించేయాలని పోలీసులకు సూచించారు. అనంతరం పత్రాలను తీసుకుని కార్యాలయానికి రావాలని ఇరువర్గాలకు తహసీల్దార్ సూచించారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా యాదీలాల్



ఆమనగల్లు: ఆమనగల్లు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది అండేకార్ యాదీలాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో శుక్రవారం అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు.. అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు లక్ష్మణశర్మ పర్యవేక్షణలో నూతన కమిటీని నియమించారు. అధ్యక్షుడిగా యాదీలాల్, ఉపాధ్యక్షుడిగా రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా దుడ్డు ఆంజనేయులు యాదవ్, సంయుక్త కార్యదర్శిగా విజయ్‌కుమార్, కోశాధికారిగా కృష్ణ, లైబ్రేరియన్‌గా మల్లేశ్‌లు ఎన్నికయ్యారు. అనంతరం నూతన అధ్యక్షుడికి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాదీలాల్‌ను అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు జగన్, న్యాయవాదులు జానకీరాములు, కృష్ణయ్య, భాస్కర్‌రెడ్డి, వెంకట్‌గౌడ్, సుధాకర్ రెడ్డి, మల్లేశ్‌గౌడ్, శ్రీను, మధుగౌడ్, గణేశ్‌గౌడ్, సంతోష్, మురళీకృష్ణ, బిక్యానాయక్, దేవేందర్, శిరీష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

లంచం అడిగితే సమాచారం ఇవ్వండి

- క్రమంగా సంక్షేమ పథకాల అమలు
- అర్హులందరికీ లబ్ధి చేకూరుస్తాం
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

తుర్కయంజాల్: 'ప్రభుత్వంతో పనిచేయించుకోవడం ప్రజల హక్కు. అధికారులు ఎవరైనా లంచాలు అడిగితే ఇవ్వొద్దు. ఇవ్వాలని డిమాండ్ చేస్తే.. ఫోన్ ద్వారా నాకు సమాచారం ఇవ్వండి' అని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. తుర్కయంజాల్ రైతుసేవా సహకార సంఘం ఆవరణలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే సమయానికి రాష్ట్రం అప్పుల కుప్పగా ఉందని, ఉద్యోగులకు కనీసం జీతాలు ఇవ్వడానికే ఇబ్బంది పడాల్సి దుస్థితి ఉండేదని తెలిపారు. ప్రతి నెల రూ.6 వేల కోట్లు వడ్డీ కట్టడానికే సరిపోతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం కష్టాల్లో ఉన్నప్పటికీ ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని వెల్లడించారు. అనివార్య కారణాల వలన కొన్ని పథకాలను అమలు చేయడం లేదని, దీనిపై ప్రజల్లో వ్యతిరేకత ఉన్నమాట వాస్తవమేనని ఎమ్మెల్యే అన్నారు. త్వరలోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం, నిరుద్యోగ యువతకు సంక్షేమ పథకాలను అమలు చేయనున్నామని వివరించారు.

ఆదర్శ సంఘం

తుర్కయంజాల్ సహకార సంఘం రాష్ట్రంలోని ఇతర సంఘాలకు మొదటి నుంచి ఆదర్శంగా నిలుస్తుండటం అభినందించదగిన విషయమని ఎమ్మెల్యే కొనియాడారు. సంఘం చైర్మన్, డీసీసీబీ చైర్మన్, టిస్కాబ్ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య మాట్లాడుతూ.. రైతుల అభివృద్ధి కోసం సంఘం తరుపున అనేక కార్యక్రమాలను చేపడుతున్నామని, త్వరలోనే డ్రోన్‌ల ద్వారా పంటలకు మందులను పిచికారీ చేసే యంత్రాలను అందుబాటులోకి తేనున్నామని చెప్పారు. ఈ సందర్భంగా 2024 సెప్టెంబర్ నుంచి 2025 ఫిబ్రవరి వరకు జరిగిన జమా, ఖర్చులను ఆమోదించడంతో పాటు, 2025- 26 ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్‌ను ఆమోదించారు. కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, డైరెక్టర్లు వంగేటి లక్ష్మారెడ్డి, సామ సంజీవ రెడ్డి, చాపల యాదగిరి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రూ.9.08 లక్షలకు తైబజార్ వేలం

కడ్తాల్: తై బజార్‌కు వేలం పాట వేయగా.. రూ.9.08 లక్షలకు పలికింది. 2025- 26 ఆర్థిక సంవత్సరానికి ఎంపీడీఓ సుజాత ఆధ్వర్యంలో శుక్రవారం కడ్తాల్ జీపీ కార్యదర్శి అల్లాజీ అధ్యక్షతన జీపీ కార్యాలయంలో తై బజార్‌కు వేలం నిర్వహించారు. ప్రభుత్వ కనీస ధర రూ.9,07,750గా నిర్ణయించారు. వేలంలో ముగ్గురు పోటీ పడగా.. రూ.9,08,500 (తొమ్మిది లక్షల ఎనిమిది వేల ఐదు వందలు)లకు గురిగళ్ల చంద్రయ్య తైబజార్‌ను దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా ఎంపీఓ లాలయ్య మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారమే డబ్బులు వసూలు చేయాలని నిర్వాహకుడికి సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, మాజీ ఉప సర్పంచ్ కదారి రామకృష్ణ, యువజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు రాఘవేందర్, యాదయ్య, మహేశ్, చేగూరి మహేశ్, నాయకులు నర్సింహ, చంద్రయ్య, రాజేందర్‌గౌడ్, నాగార్జున్, మహేశ్ పాల్గొన్నారు.



తైబజార్ కైవసం చేసుకున్న చంద్రయ్యను సన్మానిస్తున్న ఎంపీడీఓ, ఎంపీఓ, నాయకులు

రూ.22.50 కోట్ల రుణాలు అందించాం

- మొండి బకాయి రూ.8.30కోట్లు వసూలు
- సహకార సంఘం చైర్మన్ భరత్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ భరత్‌కుమార్

అబ్దుల్లాపూర్‌మెట్: గడిచిన ఏడాది కాలంలో బాటసింగారం రైతు సేవా సహకార సంఘం పరిధి రైతులకు రూ.22.50 కోట్ల రుణాలను అందజేశామని సంఘం చైర్మన్ చేగూరి భరత్ కుమార్ తెలిపారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని సంఘం కార్యాలయ ఆవరణలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సహకార శాఖ జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ విజయతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. సంఘం నుంచి అందించే రుణాల గరిష్ఠ పరిమితి రూ.10లక్షల నుంచి 15 లక్షలకు పెంచామని, సంఘం కార్యకలాపాలను అభివృద్ధి చేసి రూ.103 కోట్ల టర్నోవర్‌ను సాధించామని పేర్కొన్నారు. రుణాలు చెల్లించని 324 మంది మొండి బకాయిదారుల నుంచి రూ.8.30కోట్లు వసూలు చేశామని ఆయన వెల్లడించారు. సకాలంలో రుణాలు చెల్లించి సంఘం అభివృద్ధికి తోడ్పాటు అందించాలని రైతులకు సూచించారు. సంఘం జమాఖర్చులు, సంఘం వ్యవహారాల నివేదిక, ఆడిట్ రిపోర్ట్‌ను మేనేజర్ జక్కుల ఐలేష్‌యాదవ్.. సభ్యులకు చదివి వివరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నార్ల కొండ మల్లమ్మ జంగమయ్య యాదవ్, డైరెక్టర్లు మొగుళ్ల యాదిరెడ్డి, పగిళ్ల బాల్ రెడ్డి, బిజిలి బాలనర్సింహ, గంట శ్రీనివాస్ రెడ్డి, ఇటుకల మహేందర్ రెడ్డి, కొత్తపల్లి జైపాల్ రెడ్డి, మేకల రాములు యాదవ్, కందాడి మహిపాల్ రెడ్డి, మేనేజర్ జక్కుల ఐలేష్ యాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడుతున్న ఎంఈఓ

- మండల విద్యాధికారిని సస్పెండ్ చేయాలి
- డీఈఓ సుశీందర్‌రావుకు యూటీఎఫ్ నాయకుల వినతి

ఆమనగల్లు: అధికార దుర్వినియోగం చేయడంతో పాటు అక్రమాలకు పాల్పడిన ఆమనగల్లు ఎంఈఓ పాండును సస్పెండ్ చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్, ప్రధాన కార్యదర్శి వెంకటప్పలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షల నిర్వహణకు సీసీగా నిబంధనలకు విరుద్ధంగా నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి ఉపాధ్యాయుడిని ఎంఈఓ నియమించారని పేర్కొన్నారు. మండలంలో ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు అసంబద్ధంగా డిప్యుటేషన్ ఇచ్చారని తెలిపారు. ఇదే విషయమై బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డీఈఓకు ఫిర్యాదు చేశారని గుర్తుచేశారు. ఎన్నికల విధుల కోసం ఆర్ఓ, ఏఆర్ఓల నియామకంలో ఎంఈఓ జూనియర్లకు అవకాశం కల్పించారని ఆరోపించారు. ఎస్ఎస్‌సీ ఇంటర్నల్ మార్కుల విషయంలో సీనియర్స్‌ను కాదని, 2024 ప్రమోటీస్ ఉపాధ్యాయులకు విధులు వేశారన్నారు. ఎంఐఎస్ కో ఆర్డినేటర్‌తో కలిసి ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లను తనిఖీ చేసి, ఇబ్బందులకు గురి చేయడంతో పాటు బిల్స్ చేయడానికి డబ్బులు తీసుకుంటున్నారని తెలిపారు. ఇంటర్మీడియట్ ఇన్విజిలేషన్‌కు.. తనకు అనుకూలంగా ఉన్న ఉపాధ్యాయులను పంపించారని పేర్కొన్నారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మొదటి ముగ్గురు సీనియర్ ఉపాధ్యాయులను కాదని, నాలుగో సీనియర్ ఉపాధ్యాయుడితో జాయింట్ అకౌంట్‌తీసి, గ్రాంట్‌లు డ్రా చేశారని వెల్లడించారు. ఎంఈఓ పాండు చేసిన అవినీతి, అక్రమాలపై పూర్తి విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



డీఈఓ సుశీందర్‌రావుకు ఫిర్యాదు చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి



ర్యాలీ తీస్తున్న ఏపీఎం శోభ తదితరులు

మంచాల: మానవ అక్రమ రవాణాను అరికట్టాలని ఏపీఎం శోభ అన్నారు. శుక్రవారం మహిళ సమాఖ్య భవనంలో వీఓఏ, వీఓబీలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేదరికం, అజ్ఞానం ఆసరా చేసుకొని.. కొందరు వారిని నమ్మించి ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తుంటారని పేర్కొన్నారు. గ్రామీణ స్థాయిలో ఇలాంటి చర్యలను అరికట్టాలని, ప్రభుత్వ సహకారంతో సమష్టిగా కృషి చేయాలని సూచించారు. అప్పుడే సత్ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. అనంతరం ర్యాలీ తీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.వీ.ప్రసాద్, జెండర్ పాయింట్ పర్సన్ శ్యామల, సీసీలు, ఈసీ సభ్యులు పాల్గొన్నారు.